తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org


హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

శుక్రవారం
25 ఏప్రిల్ 2025 | పేజీలు : 08



Follow :



# కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు..
# ఆత్మహత్యాయత్నం

## ఒక వర్గం నేతకు అవమానం

- ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుకున్న మరో వర్గం
- పోలీసుల జోక్యంతో ముందుకు కదిలిన ఎమ్మెల్యే కాన్వాయ్
- ఎమ్మెల్యే వెళ్ళిన తర్వాత కాంగ్రెస్ నేత ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రికి తరలింపు పరిస్థితి విషమం
- ఎమ్మెల్యే కార్యక్రమంలో ఘటన
- విచారణ జరుపుతున్న బషీరాబాద్ పోలీసులు



## ఎమ్మెల్యే సాక్షిగా రెండు వర్గాల మధ్య విభేదాలు బహిర్గతం

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 24 (జనం సాక్షి) :** ఎమ్మెల్యే సాక్షిగా అధికార కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాల మధ్య నెలకొన్న విభేదాలు బహిర్గతమయ్యాయి. అధికార కార్యక్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక వర్గం సీనియర్ నేతను మరో వర్గానికి చెందిన నేత చేతిలో ఉన్న మైకును ఆఫ్ చేసి అవమానించారు. పోలీసులచే వేదికపై నుంచి దింపించేసారు. ఇది అవమానంగా భావించిన మరో వర్గం ఎమ్మెల్యే కాన్వాయ్ ని ముందుకు కదలనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉదృత వాతావరణం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకొని ఎమ్మెల్యే కాన్వాయిని అడ్డుకున్న కాంగ్రెస్ నేతలను బలవంతంగా పక్కకు నెట్టివేసి ఎమ్మెల్యే వెళ్లడానికి లైన్ క్లియర్ చేశారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని మైల్వార్ గ్రామంలో గురువారం జరిగింది. తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గురువారం జుంటుపల్లి నీళ్లపల్లి మైల్వార్ గ్రామాల మీదుగా దాదాపు 50 కోట్ల అంచనా వ్యయంతో బిటి రోడ్డు. 60 లక్షలతో మైల్వార్ గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైల్వార్ గ్రామంలో జరిగిన అధికార కార్యక్ర మం వేదికపై అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. ఈ వేదికపై జిల్లా అధికార యంత్రాంగం తో పాటు తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఉన్నారు. మైల్వార్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత బుచ్చిరెడ్డి మాట్లాడుతుండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో వర్గం ఆయన ప్రసంగాన్ని అడ్డుకుంటూ చేతిలో ఉన్న మైకును కట్ చేశారు. ఈ సంఘటన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వేదికపై ఉండగానే జరిగింది. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వావాదం జరిగింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని బుచ్చిరెడ్డి వర్గాన్ని వేదికపై నుంచి కిందికి దింపి గొడవ జరగకుండా సర్ది చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కష్టపడిన తనను వేదికపై గ్రామ సమస్యల గురించి మాట్లాడనివ్వకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో వర్గం అడ్డుకుంటున్నారని అవమానంగా భావించిన కాంగ్రెస్ సీనియర్ నేత బుచ్చిరెడ్డితో పాటు ఆయన అనుచరవర్గం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కాన్వాయ్ ని అడ్డుకున్నారు. దీంతో ఉద్రుక్త పరిస్థితి నెలకొంది. పరిస్థితి చేయి జారిపోకుండా బషీరాబాద్ పోలీసులు కాంగ్రెస్ నాయకులను నేతలను అక్కడి నుంచి బలవంతంగా పంపించేసి ఎమ్మెల్యే కాన్వాయ్ వెళ్లడానికి లైన్ క్లియర్ చేశారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ముందే తమకు అవమానం జరిగిన పట్టించుకోలేదని మనస్థాపాన్ని గురైన కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యనికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను తాండూర్ ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి వికారాబాద్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన వికారాబాద్ మిషన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

దీంతో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వికారాబాద్ మిషన్ ఆసుపత్రికి వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తుంది. కాగా ఈ విషయమై బషీరాబాద్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. బాధితుడు బుచ్చిరెడ్డి నుంచి బషీరాబాద్ పోలీసులు స్టేట్మెంట్ రికార్డ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక వర్గం తమను బెదిరించి భయభ్రాంతులకు గురి చేసిన కారణంగానే ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు బాధితుడు బషీరాబాద్ పోలీసులకు స్టేట్మెంట్ ఇచ్చినట్లు తెలుస్తుంది.



## శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి కళ్యాణం కమనీయం

- తరలివచ్చిన భక్తజనం-కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

*తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువారం శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి కళ్యాణం కనుల పండువగా జరిగింది.వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారికి పట్టు వస్త్రాలు,స్వర్ణ,ముత్యాల ఆభరణాలతో అలంకరించారు.*

లోపలి పేజిలో

## ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

- ఉగ్రవాద సంస్థలను ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌ను ప్రపంచ దేశాలు ఏకాకిని చేయాలి
- ఉగ్రవాద సంస్థలపై, పాకిస్తాన్ దుశ్చర్యలపై ఎలాంటి చర్యలు తీసుకున్నా కేంద్రానికి తమ సంపూర్ణ మద్దతు
- సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర




మెయిన్‌లో

## సంక్షేమ సంఘాలు అభివృద్ధికి బాసటగా నిలవాలి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద



లోపలి పేజిలో

## భూభారతి పై అవగాహన సదస్సు



దోమ మండల తహసీల్దార్ పురుషోత్తం

**దోమ ఏప్రిల్ 23 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ ఓ ఆర్ చట్టంపై దోమ మండల పరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ పురుషోత్తం బుధవారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 11 గంటలకు భూభారతి పోర్టల్ పై అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 19 నుండి 26 వరకు మండలాల వారిగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. భూభారతి పోర్టల్ వివాదాల పరిష్కారం చేయడానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. రైతులను ప్రజలను ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలనే ఆలోచనతో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున ఈ సదస్సులో ప్రతిఒక్కరూ పాల్గొనాలని మండల తహసీల్దార్ పురుషోత్తం కోరారు.

## అమరులకు నివాళులు



**దోమ ఏప్రిల్ 24(జనంసాక్షి):** దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో మొన్న జమ్మూకాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసన గా చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో దాడి ఘటనలో అమరులైన వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ ఘటన చాలా దూరదృష్టకరం హేయమైన చర్య దీనికి బాధ్యులైన ఉగ్రవాదులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఈలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా భారత ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కోరే బుచ్చి లింగం, మాజీ ఉప సర్పంచ్ కరణం శ్రీకాంత్, సంఘం జనరల్ సెక్రటరీ సంకటి అమర్‌నాథ్ రెడ్డి, యువజన సంఘం సభ్యులు ప్రకాష్ శ్రీశైలం సాయి మల్లేష్ శ్రీను రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్యాక్రాంతం అవుతున్న గొల్ల చెరువు రక్షించుకుందాం

- బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు నగారం మల్లేశం



**తాండూరు ఏప్రిల్ 24(జనంసాక్షి):** అన్యాక్రాంతం అవుతున్న గొల్ల చెరువు రక్షించుకుందామని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు నగారం మల్లేశం పేర్కొన్నారు. గురువారం భారతీయ జనతా పార్టీ పట్టణశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని గొల్ల చెరువును సందర్శించారు. మత్స్యకార సొసైటీ సభ్యులు కబ్జా విషయంలో అన్యాక్రాంతం అవుతున్న గొల్ల చెరువుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు నగరం మల్లేశం మాట్లాడుతూ పట్టణానికి ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం అందించే గొల్లచేరువు కబ్జాలకు గురిఅవుతుందన్నారు. కపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లలితక్క, కిరణ్ కుమార్ , సంఘ సొసైటీ సభ్యులు మంతటి రాజు, జంగం నరారి, జంగిడి రాములు, జంగం అంజి, జంగిడి కృష్ణ, జంగం నరసింహులు, నీరటి వెంకటేష్, ఎరం మల్లికార్జున్, జంగం రాజేష్, గిరిజపురం పకీరప్ప, గిరిజపురం సాయి సంగ రమేష్ మలపాటిలాలు బొంరాస్పెట్ అంజి బోర రాము బొంరాస్పెట్ ఉమేష్ ఇంకా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## చలో వరంగల్ రజితోత్సవ వేడుకల గోడ ప్రతులను ఆవిష్కరించిన : ఎమ్మెల్యే

**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 24 (జనంసాక్షి):** ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని గాజులరామారం డివిజన్ నాయకులు కస్తూరి బాలరాజు, తెలంగాణ సాయిల ఆధ్వర్యంలో రూపొందించిన గోడప్రతులను గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ మహాసభకు నియోజకవర్గం నుండి భారీ ఎత్తున అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, స్థానిక నాయకులు ప్రసాద్, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

## సవరణ కోసమే భూ భారతి

- అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్



**బషీరాబాద్,ఏప్రిల్ 24 (జనంసాక్షి):** బషీరాబాద్ మండల కేంద్రంలో నావంద్గి రైతు వేదికలో భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్,ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ గతంలో ధరణి పోర్టల్ లో తప్పులను సవరించే అధికారం జిల్లా కలెక్టర్ మాత్రమే ఉండేదని,భూ భారతి పేదోడి కోసం వచ్చింది. భూ భారతిలో తప్పులు సవరించే అధికారం తహశీల్దార్,ఆర్డీవో,జిల్లా కలెక్టర్ కు ఉంటుందని,త్వరలో భూ భారతి పోర్టల్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు.అదేవిధంగా కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగా నాయక్, తహశీల్దార్ వై.వెంకటేష్,పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రామారెడ్డి,వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్,ఏఎంసి చైర్మన్ జి.మాధవరెడ్డి,వైస్ చైర్మన్ చందర్ నాయక్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కలాల్ నర్సిములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ మహారాజ్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మేడే పోస్టర్ ఆవిష్కరణ

- నాటి అమరవీరుల స్ఫూర్తిని నిలబెడుదాం
- లేబర్ కోడ్లను వ్యతిరేకిద్దాం సిఐటియు



**హయత్‌నగర్, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్‌లో వాటర్ ట్యాంక్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌ను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా కీసర నర్సిరెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాల అవుతున్న నేటికీ రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు ప్రజా ప్రయోజనాలు నెరవేరకుండా కార్పొరేట్ ప్రయోజనాల కొరకు పాలక వర్గాలు ఊడిగం చేస్తున్నాయని నాటి పోరాటంలో ఎనిమిది గంటల పనిదినం చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక వర్గం తమ ప్రాణాలను అర్పించింది. కానీ నేటి పాలకులు వారి త్యాగాలను మరిచి కార్మిక వర్గాన్ని కార్పొరేట్ శక్తులకు బానిసలుగా చేస్తున్నారని వీటన్నిటికీ వ్యతిరేకంగా కార్మిక వర్గం సంఘటిత ఉద్యమం నిర్వహించడం ద్వారానే నాటి పోరాట స్ఫూర్తి మేడే స్ఫూర్తిని నిలబెడతామని అన్నారు. ఈ మేడే సందర్భంగా నాటి అమరవీరులను స్మరించుకొని పాలకవర్గాల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికవర్గ వ్యతిరేక విధానాలపై రైతు వ్యతిరేక విధానాలపై మొత్తం ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయడం ద్వారానే మన హక్కులను మనం నిలబెట్టుకుంటామని లేనిచో కార్మిక వర్గం బానిసలుగా మారిపోతుందని అన్నారు. బానిసలుగా మారడం కంటే పోరాటాలు చేసి తమ హక్కులని తమ చట్టాలని నిలబెట్టుకోవాలని వారు అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కొరకు మే నెల ఒకటవ తేదీన జరిగే మేడేను, 20న జరిగే సమ్మెను కార్మిక వర్గం జయప్రదం చేయాలని కోరారు. ఆటోనగర్‌లోని వాటర్ ట్యాంక్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మేడే పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ కృష్ణయ్య, పి నర్సిరెడ్డి, వెంకటమ్మ, శ్రీదేవి, దేవీ సింగ్, పాల్గొన్నారు.

## భారత్‌పై ఉగ్రదాడులు బాధాకరం

- కేంద్ర ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి
- వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు అయ్యూబ్ అన్సారీ



**వికారాబాద్ ఏప్రిల్ 24(జనంసాక్షి):** జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు అయ్యూబ్ అన్సారీ అన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారి పట్ల విచారం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యంగానే పాకిస్తాన్ తీవ్రవాదులు జమ్మూకాశ్మీరుపై విరుచుకుపడి అమాయకులైన యాత్రికులను కాల్చి చంపడం జరిగిందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అలాంటివి పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చర్యకు పాల్పడిన పాకిస్తాన్ ఉగ్రవాద ముఖాలను హత మార్చాలన్నారు. దేశ భద్రతను కాపాడాల్సిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, తమ పార్టీని బలోపేతం చేసుకోవడానికి మాత్రమే పనిచేస్తున్నదని ఆరోపించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో అమరులైన పౌరులకు నివాళులు అర్పిస్తున్నామన్నారు. పహల్గాం ఉగ్రవాద దాడిలో మృతి చెందిన 28మంది పట్ల విచారం వ్యక్తం చేశారు. కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మితో ప్రభుత్వం చేయూత

- కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి
- బొంరాస్ పేట 71,దుద్యాల 36 కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ





**బొంరాస్‌పేట దుద్యాల, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా రూ.1,01,116 అందించి చేయూతనందిస్తుందని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం బొంరాస్‌పేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 71 మంది, దుద్యాల మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి,కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.పీఏసిఎస్ చైర్మన్ జయకృష్ణ, దుద్యాల తహశీల్దార్ కిషన్ నాయక్,డిప్యూటీ తహసిల్దార్ వీరేష్ బాబు,బొంరాస్ పేట ఎంపీడీవో వెంకన్ గౌడ్,ఆర్ఐ శిరీష,ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, ఆవుటి శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచంద్ర రెడ్డి, వెంకట్ రాములు గౌడ్,అంజిల్ రెడ్డి, సీసీ వెంకటయ్య,ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

# నంది వనపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

• జై బాపు జై భీమ్ జై సంవిధాన్ గొప్ప కార్యక్రమం • ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇంచార్జ్ గిరిధర్ రెడ్డి • ఏఐసీసీ ఆదేశాల మేరకు జై బాపు





**యాచారం,(జనంసాక్షి):** పేదలకు కడుపునిండా అన్నం పెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం కూడా రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం అందించడం లేదన్నారు. గురువారం యాచారం మండలం నంది వనపర్తి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొనుగోలు కేంద్ర నిర్వాహకులు స్వరూపతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం కూడా రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం అందించడం లేదన్నారు. ప్రభుత్వం అనేక వ్యయ ప్రయాసాలకు ఓర్చి ఆహార భద్రత కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,300 చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. ఈ ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కర్ణాకర్, డైరెక్టర్లు మస్కు నరసింహ, గులాం అక్బర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమృత సాగర్, వ్యవసాయ ఆధికారి రవినాథ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నర్రే శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు. జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంను గ్రామంలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కార్యక్రమం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇంచార్జ్ గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమం అని, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి ప్రజల వద్దకు వెళ్లి స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా,అదే విధంగా దేశంలో బిజెపి ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, అప్రజస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని అన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం



**బొంరాస్ పేట, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** మండల పరిధిలోని లింగన్ పల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రాడ్యుయేషన్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల్లో నృత్యాలు పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మంజుల, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి, ఉపాధ్యాయులు అమూల్య,నరేష్ అంగన్వాడీ టీచర్లు సుగుణ, జగదీశ్వరి, అర్చన తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదంపై నిరసన



**షాబాద్, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** కాశ్మీర్ పహల్గం ఉగ్రదాడిని ఖండిస్తూ షాబాద్ గ్రామంలోని యువకులు, ప్రజలు మతాలకు, పార్టీలకు అతీతంగా దేశ సమైక్యతను చాటిచెప్పారు. ఉగ్రవాదులు భారతదేశ సమగ్రతను దెబ్బతీయడానికి మతం పేరుతో ఎన్ని ఉగ్రదాడులు చేసిన భయపడేది లేదని, ఇది పిరికిపందల చర్యఅని, దమ్ము ధైర్యం ఉంటే మా ఆర్మీతో తలపడాలని, జై భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ, షాబాద్ ముఖ్య కూడలిలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కొవ్వొత్తుల ర్యాలీతో బయలుదేరి, జ్యోతిరావుపూలే విగ్రహం చౌరస్తాలో మానవహారం నిర్వహించి ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తమ్మలి రవీందర్,మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, సత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షులు మాణిక్యం,కిరణ్,రాపోలు నర్సింలు, రాము,గంధం గౌరీ ,తౌఫీక్, ముక్రం ఖాన్,లింగం గౌడ్,తమ్మలి గౌతం,కమ్మరి శ్రీనివాస్ పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నర్సింలు, లక్ష్మణ్ , మొయినాబాద్ మండల పిఆర్‌టియుటిఎస్ అధ్యక్షులు జక్కని బందయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ సభకు భారీ సంఖ్యలో తరలివెళ్దాం

• కెసిఆర్ సార్ సందేశానికై వేయి కళ్ళతో ఎదురు చూస్తున్న తెలంగాణ ప్రజలు
• వికారాబాద్ మండల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగళ్ల అశోక్



**వికారాబాద్ ఏప్రిల్ 24(జనంసాక్షి):** తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక ప్రజల గుండెచప్పుడై గులాబీ జెండాతో 14 పోరాటం తర్వాత దశాబ్ద కాలంలోనే శతాబ్ద అభివృద్ధిని చేసి చూపిన తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు అన్ని దారులు ఎల్కతుర్తి వైపు అడుగేస్తున్నాయని. బండెనక బండి కట్టినట్టు అంతా సభా ప్రాంగణం వైపు కదం తొక్కుతున్నారన్నారు. బీఆర్ఎస్ 25 వసంతాల పండగలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సార్ సందేశం కోసం యావత్ తెలంగాణ ప్రజానీకంలో ఆసక్తి సర్వత్రా నెలకొందని. మార్పు పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఆశ చూపి నయవంచనకు గురిచేసిందని, ఇచ్చిన గ్యారంటీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదు. మహాలక్ష్మీ పథకం కింద రూ.500 గ్యాస్ సబ్సిడీ వేస్తామని మోసం చేసింది. కేవలం రెండు, మూడు నెలలు మాత్రమే సబ్సిడీ వేసింది. ఆ తర్వాత రూ.50 మాత్రమే సబ్సిడీ వేస్తుంది. ఇదే విషయంపై ఇటీవల రేవంత్ సర్కార్ ప్రజాగ్రహనికి గురైందన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వికారాబాద్ నుండీ జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మిత్రు ఆనంద్ అన్న నాయకత్వంలో భారీగా జనం తరలి రావాలని పిలుపునిచ్చారు.

## పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా అల్వాల్‌లో కొవ్వొత్తుల ర్యాలీ



**అల్వాల్, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా అల్వాల్ ఏ-బ్లాక్ కాంగ్రెస్ నాయకులు బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు ఉగ్రవాదానికి అండగా ఉన్న పాకిస్తాన్ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఉగ్రవాదానికి తాము తీవ్రంగా వ్యతిరేకమని, దేశ భద్రత విషయంలో అన్ని పార్టీలు ఏకతాటిపై నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు నిమ్మ అశోక్ రెడ్డి, బొబ్బిలి సురేందర్ రెడ్డి, రాజసింహా రెడ్డి, బలవంత రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వీనస్ మేరీ సహా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచిపోయే సన్న బియ్యం పథకం అమలు పేదలకు గొప్ప వరం



**మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి**

**కాప్రా, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం చరిత్రలు నిలిచిపోయే పథకాన్ని మాజీ కార్పొరేటర్ పజ్జురి పావని మనపాల్ రెడ్డి అన్నారు. గురువారం డాక్టర్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ శ్రీ శివ సాయినగర్‌లో కుందనపల్లి బాలమణి నరసింహ సన్నబియ్యం లబ్దిదారులు ఇంట్లో ఆమె భోజనం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ, సామాన్యుడితో కలిసి మెలగడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం. రాష్ట్రంలో అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం పేదలకు వరంగా మారిందని ప్రజలు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా సన్న బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని మాజీ కార్పొరేటర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు బొజ్జ రాఘవరెడ్డి, పెద్ది నాగరాజు, నాగేశ్వర్ రెడ్డి. శ్రీనివాస్, ప్రకాష్, అరుణ్, ఉమేష్, రాజేష్, సాయి, రాజు, నగేష్, రాగనాయకులు, పాపారావు, మహేష్, వాసు, విల్సన్ ప్రేమ్, నిర్మల్, శ్యామల, శ్రావణి, విజయ్, శ్రీవాణి, రమాదేవి, ఎలామ్మ, మలేష్, నరేష్, నరసింహ, కుర్వా, రాజయ్య, నర్సింహోలు, పద్మ సాయి, లక్ష్మి, మహీ, మలేష్, సంధ్య, జయమ్మ బాను తదితరులు పాలొగొన్నారు.

## రైతులు పండించిన ప్రతి ధాన్యము గింజను మన రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

• సన్న వరికి కనీస ధర కంటే అదనంగా ఐదువందల రూపాయలు బోనస్ • జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్
• దళారీ బారిన పడకుండా రైతులు కోనుగోలు కేంద్రాదను సద్వినియోగం చేసుకోవాలి • ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి





**తాండూరు ఎప్రిల్ 24(జనంసాక్షి):** రైతులు పండించిన ప్రతి ధాన్యము గింజను మన రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాసింపూర్ గ్రామంలో ఎమ్మెల్యే బయ్యని మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్ట ర్ ప్రతీక్ జైన్ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌తో కలసి కాసింపురంలోని ఐకెపి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారం భించారు.ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యము గింజను మన రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. సన్న వరి ధాన్యమునకు కనీసం ధరకంటే అదనంగా 500 రూపా యలు బోనస్‌గా మన రాష్ట్రప్రభుత్వం చెల్లిస్తుందని రైతులకు తెలిపారు. అంతేకా కుండా గడచిన ఖరీఫ్ సీజన్ నందు ఐకెపి మహిళా గ్రూప్స్‌వారు కొనుగోలు కేంద్రాన్ని చాలా మంచిగా నిర్వహించినట్లు ప్రశంసిం చారు.అదేవిధంగా రబీ 2024-25 సీజన్లో కూడా రైతులు నుంచి సకాలంలో ధాన్యం సేకరించాలని ఐకెపి మహిళా సంఘాలను కోరడం జరిగింది. తదనంతరం అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ యాలాల మండలంలోని వరి కొనుగోలు కేంద్రా లను ఆకస్మికంగా తనిఖీచేసి అక్కడ కొనుగోలు చేసిన ధాన్యమును పరిశీలించి రైతుల నుంచి కొన్న వరి ధాన్యమును వెంటనే టాప్ నందు కనిపించే రైస్ మిల్స్‌కి పంపించాల్సిందిగా తెలిపారు. రబీ సీజన్లో అకాల వర్షాలు వస్తాయి గనుక అకాల వర్షాలు వచ్చినచో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు కావలసిన టార్పాలిన్స్ అం దుబాటులో ఉంచుకోవాలని మహిళా సంఘాలకు తెలిపారు. ఇప్పటికే వికారాబాద్ జిల్లాలో 128 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పుడే కోతలు మొదలైనట్లుగా తెలుపుతూ పూర్తిస్థాయిలో నెలాఖరుకల్లా అన్ని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం వస్తుంద న్నారు.ఈ తనిఖీల లో డిఎస్ఓ వి. మోహన్ బాబు, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్ కూడా ఈ యొక్క తనిఖీలో పాల్గొన్నారు.

## వెంకటాపురంలో చలివేంద్రం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి




**అల్వాల్, ఏప్రిల్ (జనంసాక్షి):** మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వెంకటాపురంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ చలివేంద్రంను సూర్యకిరణ్, వీనస్‌మేరీ, దేవేందర్ సంయుక్తంగా ఏర్పాటుచేశారు. వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించే దిశగా చలివేంద్రం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని హనుమంతరావు అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అండగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా, అల్వాల్ సర్కిల్ ఎస్సీ విభాగ అధ్యక్షుడు దేవేందర్ జన్మదినం సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఆయురారోగ్యాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిమ్మ అశోక్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, భాస్కర్, కిట్టు, కేబుల్ శేఖర్, బలవంత్ రెడ్డి, రాజసింహారెడ్డి, నాగేశ్వరరావు, శివ సాయి కుమార్, మహిళా అధ్యక్షురాలు వీనస్ మేరీ, పద్మ, భబిత, గాయత్రి, శశికళ, నిర్మల తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మియాపూర్ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా : కార్పొరేటర్ ఉప్పలపాటి



కార్పొరేటర్ ఉప్పలపాటి

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధి శ్రీ లక్ష్మీ వెంకట నగర్, జనప్రియ వెస్ట్ సిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు పలు సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. దీనిపై కార్పొరేటర్ శ్రీకాంత్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ లక్ష్మీ వెంకట నగర్, జనప్రియ వెస్ట్ సిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు ఆయా కాలనీలలో పలు సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై కలవడం జరిగిందని సదరు కాలనీలలో మౌలికవసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని అన్నారు. లక్ష్మీ వెంకటనగర్, జనప్రియ వెస్ట్ సిటీ రెసిడెన్స్ కాలనీల ప్రజలకు అందుబాటులో ఉంటూ రోడ్లు, డ్రైనేజి, మంచినీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసాని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ సహకారంతో డివిజన్ పరిధిలో మంజూరైన అభివృధి పనులను విడతల వారిగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తానని శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ వెంకట నగర్ కాలనీ వాసులు శ్రీనివాసరావు, మోహన్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, శివ కోటేశ్వరరావు, జనప్రియ వెస్ట్ సిటీ అసోసియేషన్ సభ్యులు ప్రసాద్, ఇమాన్యుయల్, ఇన్నారెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రామలింగం గౌడ్, సోమిరెడ్డి, భాస్కర్ రావు, మల్లికార్జున్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**బషీరాబాద్,ఏప్రిల్ 24(జనంసాక్షి):** మండలం పరిధిలో కాసింపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్,శాసన సభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిస్టిక్ సివిల్ సప్లై ఆఫీ సర్ మోహన్ బాబు, అడిషనల్ కలెక్టర్ లింగా నాయక్, ఏఎంసి చైర్మన్ జి.మాధవరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, ఏఎం సీ వైస్ చైర్మన్ చందర్ నాయక్,ఏపీఎం పద్మారావు,గ్రామ సంగం అధ్యక్షురాలు మంగమ్మ, కొనుగోలు కేంద్రం కమిటీ సభ్యులు అరుణమ్మ, సునీత, సిసిలు రాములు, నర్సమ్మ, సేవ్యనాయక్, కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళకై లబ్ధిదారుల ఎంపిక పరిశీలన



**యాచారం, (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మల్కీజ్‌గూడా గ్రామములో ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో లబ్ధిదారుల ఇళ్ల స్థలాల నివాసాలను హౌసింగ్ ఏఈ సూర్యవంశం పంచాయతీ కార్యదర్శి మమత పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ళు ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని అర్హులైన వారికీ కచ్చితంగా ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని ఎంపికైన లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వి నియోగము చేసుకోవాలని సూచించారు. పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంద్రమ్మ ఇళ్ళు పథకం నిరుపేదలకు ఎంతో మంచి పథకము పాల్గొన్న నాయకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికారప్రతినిధి వరికుప్పల సుధాకర్ గ్రామా మాజీ ఉపసర్పంచ్ గౌరారం వెంకట్ రెడ్డి మాజీ సర్పంచ్ తనయుడు చీర శేఖర్, నాయకులూ దేరంగుల పాండు వారికుప్పలా సాయిబాబు డి రామకృష్ణ కరోబర్ ఏ జగన్ పి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్య శిక్షణ విజయం విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ












**అల్వాల్, ఏప్రిల్ 24(జనంసాక్షి):** మచ్చబోలారం డివిజన్‌లో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో టైలరింగ్, బ్యూటీవెల్నెస్, రిటైల్, ఐటీ/ఐటిఇఎస్ కోర్సులు విజయవంతంగా పూర్తిచేసిన మొదటి బ్యాచ్ విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, యుసిడిఐ పిఒ మదన్ మోహన్, కాంగ్రెస్ బృందం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ విజయ్ కుమార్ దాట్ల ఫౌండేషన్, తెలంగాణ ప్రభుత్వం, జిహెచ్ఎంసి సంయుక్తంగా చేపట్టిన ఈ "బయోలాజికల్ ఈ. లిమిటెడ్" ఫ్లాగ్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ ద్వారా వెనుకబడిన వర్గాలకు ఉచిత నైపుణ్య శిక్షణ అందించబడుతోంది. పాల్గొన్నవారిలో 70 శాతానికి పైగా ఉద్యోగ నియామకాలు పొందగా, 30 శాతం మంది స్వావలంబంగా మారారు. లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సహకారంతో ఫార్మా ఇండస్ట్రియల్ శిక్షణ బ్యాచ్ ప్రస్తుతం కొనసాగుతోంది, ఇది జూలై 2025 నాటికి పూర్తవుతుంది. ఈ కార్యక్రమం డిజిటల్ అక్షరాస్యత, ఉపాధి అవకాశాల పెరుగుదల, సామాజిక సాధికారతకు దోహదపడే ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య మోడల్‌గా నిలిచింది.

## పెద్ద అంబర్‌పేట్‌లో మేడే గోడ పత్రిక విడుదల



**అబ్దుల్లాపూర్మెట్, ఏప్రిల్ 24(జనంసాక్షి):** అబ్దుల్లాపూర్మెట్ మండలంలోని పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ కార్యాల యం వద్ద సిఐటియు (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్) ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్య దర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ, మేడే కార్మికుల దినోత్సవం ఎనిమిది గంటల పనిదినం కోసం అనేకమంది కార్మిక వీరులు రక్తం చిందించి సాధించిన రోజని గుర్తు చేశారు. కార్మికులందరూ ఈ మేడే కార్యక్రమాన్ని విజ యవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను సవరించి, కార్మికుల హక్కులను కాలరాస్తూ, ఎనిమిది గంటల పనిదినాన్ని రద్దు చేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేయాలని చూస్తోందని విమర్శిం చారు. యాజమాన్యాలు చెప్పినట్లు వినాలని, కార్మికుల హక్కులను అణచివేసే ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా మేడే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ, కార్మికులు మైసయ్య, పోచయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

- నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసేలా చొరవ
- బండపల్లి మైల్వార్ డబుల్ రోడ్డుకు శంకుస్థాపనలు
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి





**తాండూరు ఏప్రిల్ 24(జనంసాక్షి):** రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం యాలాల మండలం జుంటుపల్లి వద్ద బండపల్లి నుంచి బషీరాబాద్ మండలం మైల్వార్, రుద్రారం, నీళ్లపల్లి ఇస్మాయిల్ పూర్ గ్రామాలకు ఎస్టీఎఫ్ నిధులు రూ.55కోట్లలో చేపడుతున్న డబుల్ లైన్ రోడ్డు పనులను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. రోడ్లను నాణ్య ప్రమాణాలతో త్వరగా పూర్తిచేసేలా దృష్టిసారించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండలాల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువనేతలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాల మొదటి స్నాతకోత్సవం








**చేవెళ్ల, ఏప్రిల్ 24(జనంసాక్షి):** వైద్యులు దేవుళ్ళతో సమానమని, మానవాళికి సేవ చేసేందుకు గొప్ప మార్గం వైద్య వృత్తి అని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాల మొదటి స్నాతకోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరైయ్యారు. ప్రభుత్వ చీఫ్ విప్ కళాశాల చైర్మన్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రముఖ వైద్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...ఈ విద్యా సంస్థ తొలి బ్యాచ్‌తోనే డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాలకు మంచి గుర్తింపు రావాలని ఆకాంక్షించారు. ఇప్పుడు పట్టాలు తీసుకుని బయటకు వెళ్తున్న విద్యార్థులే...దేశవిదేశాల్లో చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాలకు బ్రాండ్ అంబాసిడర్లని కొనియాడారు. ఏ వృత్తికీ లేని గౌరవం ఒక్క వైద్యానికే దక్కిందన్నారు. ఇది పవిత్రమైనది, వృత్తి విలువలను కాపాడుకోవాలనీ తెలిపారు. వైద్యులకు ముందు వైద్యం, రోగులను బతికించడం ముఖ్యం, పేరు, డబ్బు కోసం పాకులాడకూడదని, మంచి డాక్టర్లుగా గుర్తింపు పొందితే అవి వాటంతట అవే వస్తాయి ఆయన వెల్లడించారు. రోగులకు సేవా భావంతో వైద్యం చేయాలని, పేదలపట్ల మానవతా దృక్పథంతో ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యం రంగానికి అధిక ప్రాముఖ్యత ఇస్తుందని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రాష్ట్రంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్లో 12,393 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడానికి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి రాజు ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన రెండు రోజుల్లోనే ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితి రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచిందన్నారు. కొత్తగా 8 ప్రభుత్వం మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తీసుకువచ్చింది అన్నారు. దీంతో రాష్ట్రంలో ఎంబిబిఎస్ సీట్ల సంఖ్య 4090కి పెరిగిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 28 పారామెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రారంభించిందని ఈ సందర్భంగా తెలిపారు. రూ2వేల 700కోట్లతో ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు కాపాడుకునేలా రాష్ట్ర జాతీయ రహదారులపై ప్రతి 30 కిలోమీటర్లకు చొప్పున ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మహేందర్ రెడ్డి రాజకీయాలలో ఉంటూ ప్రజా ప్రతినిధిగా ప్రజలకు సేవలు అందించడంతో పాటుగా మెడికల్ కాలేజీ స్థాపించి డాక్టర్లను తయారు చేస్తున్నారని వెల్లడించారు. ఈ మెడికల్ కళాశాలకి అనుబంధంగా ఉన్న 12 బెడ్స్ ఆస్పత్రి ద్వారా ఈ ప్రాంతంలోని పేదలకు వైద్య సేవలు అందిస్తున్నందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందించారు. ప్రజలకు రోగులకు మంచి వైద్యం అందించి తల్లిదండ్రుల, ప్రజా మన్ననలను పొందాలని ఆయన ఆకాంక్షించారు. మొదటి స్నాత కోత్సవంలో పాల్గొన్న 132 మంది ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు, స్పీకర్, చీఫ్ విప్ లు ఎంబిబీఎస్ పట్టాలను, పతకాల బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్ ఫార్మా వ్యవస్థాపకులు, పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఎస్సార్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్, ఎస్ ఆర్ యూనివర్సిటీ వైస్ చైర్మన్ డాక్టర్ వరద రెడ్డి, కళాశాల డైరెక్టర్లు సంతోష్ రెడ్డి, తిరుపతిరెడ్డి, కళాశాల డీన్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ జోయారాణి, మెడికల్స్ పరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, కళాశాల వైద్య అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాశ్మీర్ ఉగ్రదాడి మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ప్రదర్శన



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 24(జనంసాక్షి):** జమ్మూకాశ్మీర్లోని హహల్గం లో భారతీయ పౌరులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ ఆర్ఎస్ఎస్,హిందువాహిని, యువకులు బొంరాస్‌పేట మండల కేంద్రంలోని భూ లక్ష్మమ్మ చౌరస్తాతో పాటు, నాందార్‌పూర్ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి, మౌనం పాటించి నివాళులర్పించారు.అంతకుముందు గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

## విద్యుత్ నిలిపివేత

**షాబాద్, ఏప్రిల్ 24(జనంసాక్షి):** మండల పరిధిలోని బోడంపాడు మరియు మన్మర్రి గ్రామాలలో శుక్రవారం 11 కేవీ మన్మర్రి ఫీడర్, దగ్గరగా ఉన్న చెట్లతొలగింపు కార్యక్రమంలో బాగంగా మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కావున వినియోగదారులు సహకరించాలని ఏఈ కోటేశ్వరరావు ప్రకటనలో తెలిపారు.

## ఉగ్రవాదాన్ని ఖండించడంలో సమాజం ఏకమవడం అత్యవసరం

- ఉగ్రవాద దాడికి నిరసనగా తాండూరులో ర్యాలీ
- ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

**తాండూరు ఎప్రిల్ 24(జనంసాక్షి):** ఉగ్రవాదాన్ని ఖండించడంలో సమాజం ఏకమవడం అత్యవసరమని ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని బుయ్యని శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం పట్టణంలో పార్టీలకతీతంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ హేయకార్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పరమేశ్వరుడిని ప్రార్థించారు.ఈ నేపథ్యంలో తాండూర్ పట్టణంలో జరిగిన నిరసన ర్యాలీలో స్వయంగా పాల్గొన్నారు. కొవ్వొత్తులతో ప్రజలతో కలిసి పురవీధుల్లో నినాదాలు చేస్తూ శాంతియుతంగా నడిచారు. ఈ సందర్భంగా ప్రజల ఐక్యతను ప్రశంసిస్తూ, "ఉగ్రవాదాన్ని ఖండించడంలో సమాజం ఏకమవడం అతి అవసరం. ఇది ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తుందని అని వ్యాఖ్యానించారు.తాండూర్ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి, శాంతియుత రీతిలో తమ నిరసనను వ్యక్తపరచడం, ఐక్యతను చాటడం అభినందనీయమని కొనియాడారు.





## భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్‌లో పలువురు కార్మికనేతల చేరిక



**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్24(జనంసాక్షి):** భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ లో గురువారం పలువురు కార్మిక నేతలు, బీఎంఎస్ నేతలు చేరారు. గతంలో బీఎంఎస్‌లో పనిచేసి ఇతర యూనియన్‌లోకి వెళ్లిన గడ్డం శంకర్, బసవపురం సూర్యకుమార్, ముఖేశ్‌లు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి రాజేశ్వరరావు, జనరల్ సెక్రటరీ టి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తూర్పు రాంరెడ్డి నేతలకు కుండవాలను కప్పి, యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తూర్పు రాంరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన జీహెచ్‌ఎంసీ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో పలుసార్లు బీఎంఎస్ అఖండ విజయం సాధించి, కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. గడిచిన రెండు దశాబ్దాలుగా బీఎంఎస్ కార్మికులు, ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించి, వారి ప్రయోజనాలను కాపాడిందని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా అన్నిరంగాల్లో కార్మికులు, ఉద్యోగులకు అండగా ఉన్న బీఎంఎస్ త్యాగ్ తపస్య, బలిదాన్ అనే నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ లాంటి పెద్ద విభాగంలో కార్మికులు, ఉద్యోగులు ఐకమత్యంతో ఉన్నపుడే వారి సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి రాజేశ్వరరావు, జనరల్ సెక్రటరీ టి.కృష్ణ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీలోని ఇతర యూనియన్ల నుంచి ఇప్పటి వరకు వందమంది వరకు యూనియన్ నేతలు, కార్యకర్తలు, ఉద్యోగులు బీఎంఎస్‌లో చేరినట్లు వివరించారు. జీహెచ్‌ఎంసీ యూనియన్ గుర్తింపు ఎన్నికలు సర్కారు ఎపుడు నిర్వహించినా, బీఎంఎస్ గెలుపు సాధిస్తుందని, రోజురోజుకి బలపడుతూ ఎదురులేని శక్తిగా ఎదుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎం జాబ్రీ, అడిషనల్ జనరల్ సెక్రటరీ రాధాక్రిష్ణ, ఉపాధ్యక్షులు భిక్షపతి,మహిళా విభాగం నాయకురాలు మనోరమా, గడిపల్లి రూపేశ్, ప్రధాన కార్యాలయం ఇన్ ఛార్జి పవన్ కుమార్, ఖైరతాబాద్ జోన్ కార్యదర్శి ఆర్ వెంకటేశ్, నేతలు రసూల్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ చేసిన సేవలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



**ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్, ఏప్రిల్24(జనంసాక్షి):** రాజ్యాంగ విలువల పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం నార్సింగ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి, జై బాబు జై భీమ్, జై సంవిధాన్ సమావేశానికి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నార్సింగి చౌరస్తా నుంచి ర్యాలీగా బయలుదేరి గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమం అని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా అవగాహన కల్పించాలని, అదే విధంగా దేశంలో బిజెపి ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, అప్రజస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని, ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, గండిపేట మండల పార్టీ ప్రెసిడెంట్ అశోక్ యాదవ్ , వార్డు మెంబర్‌లు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, మహిళా నాయకురాళ్ళు పాల్గొన్నారు.

## ప్రజలకు భూముల భద్రత, భరోసా కల్పించడమే భూభారతి లక్ష్యం



**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,ఏప్రిల్24(జనంసాక్షి):** ప్రజల భూముల భద్రత, భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భూభారతి ప్రజలకు అండగా ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం గండిపేట్ మండలం ఖానాపూర్ రైతు వేదిక ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూమి హక్కుల రికార్డ్ భూ భారతి చట్టం పై అవగాహన సదస్సును ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఆర్డిఓ వెంకట్ రెడ్డి, గండిపేట మండలం తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఉండాలన్నదే భూభారతి చట్టం లక్ష్యంగా తయారు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమం లో నార్సింగ్, గుడిమల్కాపూర్ ఏఎంసీ చైర్మన్ కోట వేణు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి కళ్యాణం కమనీయం

- తరలివచ్చిన భక్తజనం-కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్









**తలకొండపల్లి ఏప్రిల్ 24(జనంసాక్షి):** తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువారం శ్రీ లక్ష్మి నారాయణ స్వామివారి కళ్యాణం కనుల పండువగా జరిగింది.వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగం గా స్వామివారికి పట్టు వస్త్రాలు,స్వర్ణ,ముత్యాల ఆభరణాలతో అలంకరించారు.శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి కళ్యాణాన్ని యాదగిరి, నరసింహయ్య, కామేశ్వరమూర్తి, వేద మంత్రోచరణల మధ్యన ఎర్రోళ్ల అంజమ్మ రామ చంద్రయ్య,ఎర్రోళ్ల వనజ రాఘవేందర్, ఎర్రోళ్ల లక్ష్మీ హైమావతి వెంకటేష్, దంపతులచే వైభవంగా కళ్యాణా న్ని జరిపించారు.స్వామివారి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాద వ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అనంతరం భక్తు లు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకు న్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ..శ్రీ లక్ష్మి నారాయణ స్వామి కళ్యాణంలో పాల్గొన్న భక్తులందరికీ పుణ్యం దక్కుతుందన్నారు. స్వామివారి చల్లని చూపు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ పురాతన ఆలయ అభివృద్ధి కొరకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్ గౌడ్,మాజీ సర్పంచ్ పయ్యావుల రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌లకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువాతో సత్కరించారు.అనంతరం ఎర్రోళ్ల అంజమ్మ రాంచంద్ర య్య,ఎర్రోళ్ల వనజ రాఘవేందర్, ఎర్రోళ్ల లక్ష్మీ హైమా వతి వెంకటేష్‌లు భక్తులకు ఏర్పాటుచేసిన అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,మాజీ ఎం పీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్,శతాబ్ది ఫౌండేషన్ అధినే త కాసు శ్రీనివాస్ రెడ్డి,సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్య క్షుడు లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ సర్పంచులు రమేష్ యాదవ్,రాములు, విజయ్‌కుమార్ రెడ్డి,లక్ష్మీ నారాయణ గౌడ్,ఆంజనేయులు గౌడ్,శేఖర్ గౌడ్,శ్రీశైలం యాదవ్, నిరంజన్,మల్లేష్,కృష్ణయ్య,శంకరయ్య గౌడ్, చంద్రయ్యగౌడ్,శ్రీను,సత్యం,బాలస్వామి,యాదయ్య,అంజయ్య,మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి,కాకి కృష్ణ,వెంకటయ్య, బోళ్ల యాదగిరి,వెంకటయ్య,అజీజ్,సొప్పరి శీను,మట్ట అంజయ్య,జక్కుల మల్లేష్, పవన్ వాల్మీకి,బొర్ర కిరణ్, కాకి శివ, వెంకట్,శివ,వెంకటాపూర్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఎఈఏడి పైన చర్య తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్



**తాండూరు ఎప్రిల్ 24(జనంసాక్షి):** పట్టణంలో కొత్తగా కరెంటు మీటర్ కోసం అప్లై చేసినా బాలస్వామిని వ్యక్తికి ఇంటికి కరెంటు మీటర్ ఇయ్యకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ 8వేల రూపాయలు కట్టాలని వేధింపులకు గురి చేస్తున్న ఏ ఈ ఏడీలపై చర్య తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తాను 2 యూనిట్లు గృహ జ్యోతి పథకంలో పేద ప్రజలకు ఇష్టమైన 200 యూనిట్లకు అధికంగా కొట్టి బిల్లులు వసూలు చేస్తున్న గృహ జ్యోతి దారులకు మోసం చేస్తున్న కరెంట్ అధికారులపై చర్య తీసుకోవాలని రేపు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రేపు 25/4/2025 నాడు 11 గంటలకు తాండూర్ డివిజన్ ఏడి ఆఫీస్ ముందు ధర్నాని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి పేదవారికి 200 యూనిట్లు ఉచితం ఇస్తామని పేద ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను గృహ జ్యోతి 200 యూనిట్ వరకు ఉచితం అని ప్రతి ఒక్కరికి జీరో బిల్లు కొట్టకుండా ప్రతి ఇంటికి 200 పై బిల్లులు కొట్టి డబ్బులు కట్టాలి లేకుంటే మీ ఇండ్లకు కరెంటు కట్ చేస్తామని హెచ్చరికలు బెదిరింపులు పాల్పడుతున్న కరెంట్ తాండూర్ ఏఈ ఏడిపైన చర్య తీసుకోవాలని పేద కుటుంబాలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న కరెంటు సక్రమంగా ఇవ్వకుండా పేద ప్రజల పైన అధిక చార్జీలు బిల్లులు కట్టని వారి కరెంట్లను కట్ చేస్తూ కొత్త కనెక్షన్లు తక్కువ రేటు ఉంటే ఎక్కువ రేటు చూపిస్తూ 8 వేల రూపాయలు కట్టాలి అని ప్రజల పైన కొత్త కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్న కరెంట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బాలస్వామి ధనియాలు సంజీవ్ శిలాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాయదుర్గం ప్రభుత్వ పాఠశాల హెడ్‌మాస్టర్‌ను వెంటనే అరెస్టు చేయండి



**హైదరాబాద్ (జనంసాక్షి):** హైదరాబాద్‌లోని రాయదుర్గం (దర్గా) ప్రభుత్వ పాఠశాల హెడ్‌మాస్టర్ ఎస్‌కే తాజ్ బాబు తనను వేధిస్తున్నాడని వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్న లక్ష్మీ ఆరోపించింది. కులం పేరుతో దూషించడమే కాకుండా లైంగికంగానూ వేధింపులకు గురిచేస్తున్నాడని పేర్కొంది. ఈ మేరకు కేవీపీఎస్ శేరిలింగంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో మాదాపూర్ డీసీపీ వినీత్‌ను బాధితురాలు కలిసి ఫిర్యాదు చేశారు. హెడ్‌మాస్టర్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రకాశ్ కారత్ మాట్లాడుతూ.. ఇదే విషయమై హెడ్‌మాస్టర్‌పై గత నెల 28వ తేదీన రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారని.. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే హెడ్‌మాస్టర్‌ను అరెస్టు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితురాలి ఫిర్యాదుపై డీసీపీ వినీత్ తక్షణమే స్పందించారు. ఈ కేసు విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాలని ఏసీపీ శ్రీకాంత్‌ను ఆదేశించారు.

# అఖిలపక్షానికి చిన్న పార్టీలను పిలువకపోవడం అప్రజాస్వామికం



**హైదరాబాద్ (జనంసాక్షి):** పహల్గాం ఉగ్రదాడిపై దేశ రాజధాని ఢిల్లీలో మరికాసేపట్లో అఖిలపక్ష సమావేశం జరగనుంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ఉగ్రదాడిపై అనుసరించాల్సిన విధానంపై చర్చించనున్నారు. అయితే హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి ఈ సమావేశానికి ఆహ్వానం అందలేదు. ఇదే విషయమై ఒవైసీ గత రాత్రి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజుకు ఫోన్ చేసి ప్రశ్నించారు. అందుకు కిరణ్ రిజుజు బదులిస్తూ.. పార్లమెంట్‌లో కనీసం ఐదుగురు ఎంపీలు ఉన్న పార్టీలను మాత్రమే అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించామని చెప్పారు. చిన్న పార్టీలను ఎందుకు ఆహ్వానించలేదని అసద్ ప్రశ్నించగా.. కీలక సమావేశం అధిక సమయం తీసుకుంటుందనే పిలువలేదని చెప్పారు. మరి మా చిన్న పార్టీల సంగతేంటని అసద్ మళ్లీ అడుగగా.. మీ గొంతు చాలా గట్టిగా వినిపిస్తుందని రిజుజు జోక్ చేశాడు. ఈ విషయాన్ని అసదుద్దీన్ ఒవైసీ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. అఖిలపక్ష సమావేశంపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని ఆయన తప్పుపట్టారు. ఉగ్రవాదంపై తీసుకోబోయే నిర్ణయం దేశ ప్రజలందరికీ సంబంధించినదని, అలాంటి సమావేశానికి కొన్ని పార్టీలను మాత్రమే ఆహ్వానించడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. చిన్న పార్టీలను ఆహ్వానించకపోవడానికి ఇదేమైనా బీజేపీ అంతర్గత సమావేశమా..? అని అసద్ ప్రశ్నించారు.

# పహాల్గాన్ ఉగ్రదాడి బాధితులకు సిపిఐ నివాళి: మతోన్మాదంపై ఆగ్రహం




**అబ్దుల్లాపూర్మెట్, ఏప్రిల్ 24 (జనంసాక్షి):** జమ్మూకాశ్మీర్‌లోని పహాల్గాన్‌లో ఏప్రిల్ 22,న ఉగ్రవాదులు టూరిస్టులపై జరిపిన దాడిలో మరణించిన వారికి అబ్దుల్లాపూర్‌మెట్టు మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు నివాళులు అర్పించారు. రావినారాయణ రెడ్డి కాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన సిపిఐ నాయకులు ఆందోజు రవీంద్రచారీ, ముత్యాల యాది రెడ్డి, పబ్బతి లక్ష్మణ్‌లు ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మతం పేరుతో దాడులు చేయడం అత్యంత బాధాకరమని, ప్రజాస్వామ్య భారత దేశంలో అన్ని మతాల ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని అన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాలు ఈ సహనాన్ని భరించలేక ఉగ్రవాద దాడులకు పాల్పడుతున్నాయని, భారతీయులు దీనిని సహించబోమని హెచ్చరించారు. దేశ రక్షణ కోసం బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించి, అవసరమైన సైనిక నియామకాలు చేపట్టాలని వారు కోరారు. మరణించిన వారి కుటుంబాలకు సిపిఐ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు కేతరాజు నర్సింహా, నవనీత, అరుణ, పుల్లయ్య, యాదగిరి, మధు, వెంకటేష్, వినోద్, శ్రావణి, గణేష్, కార్తీక్, శేఖర్, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.మతోన్మాదం నశించాలి, మానవత్వం పరిమళించాలి అని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు.

# బాలిక కిడ్నాప్ కేసులో ఐదుగురి అరెస్ట్

**హైదరాబాద్ (జనంసాక్షి):** దేళ్ల బాలికను కిడ్నాప్ చేసి విక్రయించిన ఐదుగురు సభ్యుల ముఠాను చాంద్రాయణ గుట్ట పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి బాలికను కాపాడి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు కేసు వివరాలను గురువారం చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఆగ్నేయ మండల డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్, ఏసీపీ మనోజ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ గురునాథ్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. పాతబస్తీ సలీంనగర్‌లో నివసించే సయ్యద్ జావిద్ పాషా (51), శాయిస్త పర్వీన్ (40) భార్యభర్తలు. వీరిద్దరూ కలిసి ఈ నెల 20వ తేదీన చాంద్రాయణగుట్టలో ఐదేళ్ల బాలికను ఎత్తుకెళ్లారు. అయితే బాలిక కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన చాంద్రాయణగుట్ట పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. వారిని పోలీసులు విచారించగా.. సుజాత, రాజేంద్ర ప్రసాద్ సహాయంతో పాపను కిడ్నాప్ చేసి, ఉప్పల్‌లో విక్రయించినట్లు నిందితులు వెల్లడించారు. సుజాత, రాజేంద్రప్రసాద్‌లో ముంబైలో కూడా ఇలాగే చిన్న పిల్లల విక్రయం కేసులో జైలుకెళ్లి వచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో మొత్తం ఐదుగుర్ని అరెస్టు చేసిన పోలీసులు.. బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు.